జాన్వీకి రిస్క్ తీసుకోవడం అంటే ఇష్టం.. నటిపై ప్రశంసలు కురిపించిన సోదరుడు

8 లో..


తెలుగు దినపత్రిక

RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..




పాత కారుకు కాలం చెల్లిందని పార్టీ గుర్తుగా దీన్ని తీసుకొచ్చిన సార్..!!

సంపుటి : 22 సంచిక : 337 | బుధవారం నవంబర్ 13 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

## గవర్నర్ అనుమతి రాగానే

# కేటీఆర్‌పై చర్యలు



**కబురు,దిల్లీ నవంబర్ 12**

దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. దిల్లీలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ-రేస్ స్కామ్ నుంచి తప్పించుకొనేందుకే కేటీఆర్ దిల్లీ వచ్చారని అన్నారు. గవర్నర్ నుంచి అనుమతి రాగానే కేటీఆర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. గవర్నర్ అనుమతి నుంచి తప్పించుకోవడానికే కేటీఆర్ దిల్లీ వచ్చారన్నారు. అవినీతి పార్టీ భాజపాను అంతం చేస్తామన్న కేటీఆర్.. ఇప్పుడు ఆ పార్టీ నేతలను ఎలా కలుస్తున్నారని సీఎం ప్రశ్నించారు. భాజపా-భారాస చీకటి బంధం బయటపడుతుందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

### ఇష్టమొచ్చిన చోట మొరపెట్టుకో కేటీఆర్..

"అమృత్ టెండర్లపై భారాస చేస్తున్న ఆరోపణలు అవాస్తవం. రెడ్డి పేరు మీద ఉన్న వారంతా నా బంధువులు కాదు. సృజన్ రెడ్డి భారాస మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి అల్లుడే. భారాస హయాంలో సృజన్ రెడ్డికి రూ.వేల కోట్ల పనులు కేటాయించారు. అమృత్ టెండర్లలో అవినీతి జరగలేదని ఉపేందర్ రెడ్డే చెప్పారు. ఈ టెండర్ల గురించి ఇష్టమొచ్చిన చోట మొరపెట్టుకో కేటీఆర్. కోర్టుల్లో కేసులు వేస్తామన్నా.. వేసుకోండి" అని రేవంత్ రెడ్డి అన్నారు.

### ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందే..

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని సీఎం రేవంత్‌రెడ్డి ఖండించారు. ఎంతటివారైనా ఊచలు లెక్కపెట్టాల్సిందేనని హెచ్చరించారు. దాడులు చేసిన వారిని.. చేయించిన వారిని.. ఎవర్నీ వరదబోమని హెచ్చరించారు. ఇలాంటి దాడులు భారాస హయాంలో జరిగితే సమర్థిస్తారా? అధికారులపై దాడులను భారాస ఎందుకు ఖండించదు? అని నిలదీశారు. పైగా దాడి చేసిన వారిని ఎలా పరామర్శిస్తారని.. దాడులను ప్రోత్సహించేందుకే పరామర్శలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పథకం ప్రకారమే కలెక్టర్ పై దాడి..

# ఈ ఘటన వెనక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదు



**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 2024, నవంబర్ 12న సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పథకం ప్రకారమే కొందరు రైతులను రెచ్చగొట్టి కలెక్టర్‌పై భౌతిక దాడికి పాల్పడేలా చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్ పై దాడి ఘటనపై కచ్చితంగా సమగ్ర విచారణ చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్ పై దాడి ఘటనలో కుట్రదారులెవరు.. తప్పుదోవ పట్టించి కలెక్టర్ ను గ్రామంలోకి తీసుకెళ్లింది ఎవరనే దానిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. లగచర్ల ఘటన వెనక ఎవరున్నా వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఖరాఖండిగా మంత్రి చెప్పారు.

మిగతాది 2లో



# పిరాయింపు ఎమ్మెల్యేల కేసులో ముగిసిన వాదనలు

- తీర్పును రిజర్వ్ చేసిన రాష్ట్ర హైకోర్టు
- తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తీర్పును తెలంగాణ హైకోర్టు రిజర్వ్ చేసింది. ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. వాదనలు పూర్తి కావడంతో మంగళవారం తీర్పును రిజర్వులో పెట్టింది. దీంతో తెలంగాణ హైకోర్టు నిర్ణయంపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. గతేడాది నవంబర్ నెలలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి వెళ్లిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు

మిగతాది 2లో



# నకిలీ మందులు తయారు చేసినా.. అమ్మినా కఠిన చర్యలు

**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

నాసిరకం, నకిలీ ఔషధాలు తయారు చేసే వారు.. వాటిని అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డీసీఏ) అధికారులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు.

## వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడి ఘటన..

# పోలీసుల అదుపులో 55 మంది




**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

ఔషధ(ఫార్మా) పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిన్న నిర్వహించ తలపెట్టిన గ్రామసభ రణరంగాన్ని తలపించింది. అధికారులపై గ్రామస్థులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పోలీసులు 55 మందిని అరెస్టు చేశారు. దుద్యాల, కొడంగల్, బోంరాస్‌పేట మండలాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. ప్రణాళిక ప్రకారమే దాడి జరిగినట్లు పోలీసులు గుర్తించారు. లగచర్లలో భారీగా పోలీసులు మోహరించారు.

మిగతాద్ది 2 లో

# అధికారులపై దాడిని బిఆర్ఎస్ ప్రోత్సహించదు



- ప్రభుత్వ నిర్ణయంతో అమాయక రైతులు బలి
- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడి

**కబురు, వికారాబాద్, నవంబర్ 12**

అధికారులపై దాడులను బిఆర్ఎస్ ఎప్పుడూ ప్రోత్సహించదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్, రెవిన్యూ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మంగళవారం వికారాబాద్ జిల్లాలో పర్యటించిన ఆర్ఎస్పీ.. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల అమాయక రైతులు బలవుతున్నారని విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని విజయవంతంగా పాలించిన బీఆర్ఎస్ పార్టీ అధికారులపై దాడులను ప్రోత్సహించదని స్పష్టం చేశారు. అధికారులపై దాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# రైతుల ఇష్ట ప్రకారమే భూసేకరణ జరగాలి

- గ్రామాలల్లో పోలీసులను మోహరించడం దారుణం
- ఈటల రాజేందర్

**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**



## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం

# రైతులతో ఆడుకుంటుంది

## - ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఫైర్



**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

పత్తి, వరి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుకుంటున్నది. సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేస్తున్నట్లు డ్రామాలు ఆడుతున్నారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కొనుగోళ్లు జరపకుండా పథకం ప్రకారం రైతులను దళారీలకు, మిల్లర్లకు వదిలేశారని విమర్శించారు. దీని వెనుక వందల కోట్ల అవినీతి జరిగింది.

మిగతాది 2లో

# బెదిరింపులతో రైతులను భయపెట్టలేరు

అరెస్టులతో లగచర్ల లడాయిని ఆపలేరని, బెదిరింపులతో రైతులను భయపెట్టలేరని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.



**కబురు, హైదరాబాద్ నవంబర్ 12**

కొడంగల్ నియోజకవర్గంలో సోమవారం చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో జరిగిన అరెస్టులపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. అర్ధరాత్రి 300 మంది పోలీసులను పంపి రైతులను అరెస్ట్ చేస్తారా..? అని ప్రశ్నించారు. రైతులను తీవ్రవాదులు అనుకుంటున్నారా? ఇదేనా ప్రజాస్వామ్య పాలన.. రైతు సంక్షేమ పాలన? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు అమానుషమని ఆ పార్టీకి చెందిన మరో సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. లగచర్ల వాసులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 300 మంది పోలీసులు గ్రామానికి చేరుకొని అరెస్టు చేయడం దారుణమన్నారు. కొడంగల్ చుట్టుపక్కల మండలాల్లో ఇంటర్నెట్ సేవలు, కరెంటు బంద్ చేసి వందల మంది పోలీసులను గ్రామాల్లో మోహరించి అరెస్టు చేయడాన్ని భాజపా తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీకి చెందిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రైతులతో ఆడుకుంటుంది

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వంలో మంత్రులు దళారులు, మిల్లర్లతో కుమ్మక్కు అయ్యారని మండిపడ్డారు. పదేళ్ల కాలంలో కేసీఆర్ పండిన ప్రతి గింజను కొన్నారు. నల్గొండ జిల్లా మంత్రి రైతుల వద్ద ధాన్యం కొనకుండా అధికారులను బెదిరించారు. జిల్లా మంత్రి దళారులతో కుమ్మక్కై వందల కోట్లు వసూలు చేశారన్నారు. 2014 కు ముందు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మళ్లీ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎందుకు దోపిడీకి గురి అవుతున్నారో సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటి వరకు ఒక్క గింజ సన్న వడ్లు ప్రభుత్వం కొనలేదని, సమాధానం చెప్పడానికి అధికారులు భయపడుతున్నారని తెలిపారు. ప్రజలు మర్చిపోయారు అంటున్న కేసీఆర్‌ను చూసి రేవంత్ రెడ్డికి ఎందుకు భయం అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ప్రజల తిరుగుబాటు మొదలయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని వాడుకుని రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డిని చూసి భయపడుతున్నారని చెప్పారు. కలెక్టర్ మాపైన దాడి జరగలేదని చెప్పారు. ప్రభుత్వం కేసులు ఎందుకు పెడుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మేధావులు కొడంగల్‌కు వెళ్లి రావాలని హితవు పలికారు. కొడంగల్ నియోజకవర్గంలో అధికారులను అడ్డుకోవాలని బీఆర్ఎస్ పిలుపు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఢిల్లీకి 25 సార్లు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి ఎవరి కాళ్లు మొక్కారో ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ ఢిల్లికి వెళ్లింది కాంగ్రెస్, బీజేపీ పార్టీల బండారం బయటపెట్టడానికి అని పేర్కొన్నారు. ఎవిడెన్స్ కోసం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. దానికి మాజీ ఎమ్మెల్యేలు సమాధానం ఇస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అవినీతిపై బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రిపై జరిగిన ఈడీ రైడ్స్ ను ఎందుకు బయటపెట్టలేదు? కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేవంత్ రెడ్డి వీపు పగలగొట్టడం ఖాయమన్నారు.

## సంపాదకీయం

# ‘పునర్విభజన’ సమ ప్రాతినిధ్యం కల్పించేనా?

వచ్చే ఏడాది జనగణన ప్రక్రియను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. అందులో ఒకటి మహిళా రిజర్వేషన్ చట్టం కాగా, రెండోది లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అమలు. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజకవర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. తద్వారా అన్ని ప్రాంతాలు, వర్గాలకు న్యాయబద్ధమైన హక్కుగా తగిన ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరి కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితమవుతుందా? లేక లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడింది. ఈ నేపథ్యంలోనే వివిధ వర్గాలు, ప్రాంతాలకు పారదర్శక ప్రాతినిధ్యం లభించే దిశగా రానున్న జనాభా లెక్కలు ఓ మలుపుగా నిలవాల్సిన అవసరమున్నది. పదేండ్లకోసారి జనగణన చేయడమనేది పాలన, ప్రణాళికలో చాలా ముఖ్యమైన ప్రక్రియ. జనాభా, ప్రజల స్థితిగతులు, అవసరాల ఆధారంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు, వనరుల పంపిణీకి జనగణన ఉపయోగపడుతుంది. అంతేకాకుండా నియోజకవర్గాల పునర్విభజనకు కూడా జనాభా లెక్కలే ప్రామాణికంగా నిలుస్తాయి. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడింది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా ప్రక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమమవుతుంది. భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సుదీర్ఘమైన చరిత్ర ఉన్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు గాను డీలిమిటేషన్ ప్రక్రియను మొదటిసారిగా తీసుకొచ్చారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో భిన్న ప్రాంతాల్లో, భిన్న స్థాయిలో జనాభా కలిగి ఉండటం, విభిన్న వర్గాలు ఉండటాన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం కల్పిస్తూ సమతుల్యత పాటించేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టారు. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ ప్రక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జనాభా నియంత్రణ కార్యక్రమం దక్షిణాది రాష్ట్రాల్లో విజయవంతంగా అమలైంది. అందువల్ల ఉత్తరాదితో పోల్చితే దక్షిణాదిలో జనాభా పెరుగుదల రేటు తక్కువగా ఉన్నది. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే ఇందుకు సంబంధించిన చర్చ జరుగుతున్నది. జనాభా ప్రాతిపదికన మాత్రమే నియోజకవర్గాల పునర్విభజన చేస్తే జనాభా నియంత్రణ, ఆర్థికాభివృద్ధిలో చైతన్యం కనబర్చిన రాష్ట్రాలుగా సీట్ల పెంపులో వెనుకబడిపోవడం ద్వారా దక్షిణాది రాష్ట్రాలు మూల్యం చెల్లించుకున్నట్టవుతుందని కొందరు పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు. లేకపోతే, జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాదిన సీట్లు భారీగా పెరిగి, లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక వనరుల పంపిణీ, సామాజిక అభివృద్ధి, ముఖ్యంగా రాజకీయంగా, పాలనలో అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకం. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. అంతేకాదు, నియోజకవర్గాల పునర్విభజన ద్వారా మహిళలకు దక్కాల్సిన సీట్ల సంఖ్య కూడా పెరిగే ఆస్కారమున్నది. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేందుకు ఎదుర్కొంటున్న ఆటంకాలు తొలగిపోతాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉన్నది. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. అలాంటి సమగ్ర సమాచారాన్ని విశ్లేషిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు, భావనలను గౌరవించినట్టు అవుతుంది.

## నకిలీ మందులు తయారు చేసినా.. అమ్మినా కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి

ఫార్మా సంస్థలు ఉన్న చోట అదనంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాలన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్లలో ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో వెంగళరావునగర్‌లోని డీసీఏ కార్యాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఔషధాలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, ఆకస్మిక తనిఖీల కోసం స్టేట్ విజిలెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ల్యాబ్ ఆధునికీకరణ, కొత్తగా 4 ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మషెల్కర్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. మందుల ధరలు, నాణ్యత విషయంలో నిబంధనలు ఉల్లఘించే ఆస్పత్రుల సమాచారాన్ని డీఎంహెచ్‌వోలకు అందజేయాలన్నారు. ఆస్పత్రులపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

## వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడి ఘటన.. పోలీసుల అదుపులో 55 మంది

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఏకంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలపై ఆయా గ్రామాల రైతులు కర్రలు, రాళ్లతో దాడులకు యత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టర్, అదనపు కలెక్టర్ త్రుటిలో తప్పించుకోగా కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను తప్పించేందుకు యత్నించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిపైనా దాడి జరిగింది.

**ఉద్యోగుల విధుల బహిష్కరణ**

ఔషధ పరిశ్రమలో భూసేకరణ చేపట్టాలని వెళ్లిన అధికారులపై దాడి ఘటనకు నిరసనగా.. రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో ఉద్యోగులు నిరసనకు దిగారు. వికారాబాద్ జిల్లాలో ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు.

## పథకం ప్రకారమే కలెక్టర్ పై దాడి.. ఈ ఘటన వెనక ఎవరున్నా వదిలే ప్రసక్తే లేదు

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిని అడ్డుకోవాలని ఎవరూ ప్రయత్నించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు, ప్రజలకు ఏమైనా అభ్యంతరం ఉంటే ప్రజాస్వామ్య పద్దతిలో చెప్పొచ్చని.. ఇలా అధికారులపై భౌతికి దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. సమస్యలపై ప్రజాస్వామిక పద్దతిలో ముందుకెళ్తున్నామన్నారు. రైతులను సభాస్థలికి రాకుండా కొందరు అడ్డగించారని.. దీంతో రైతుల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుందామని కలెక్టర్ వెళ్లాడని.. ఈ క్రమంలోనే పథకం ప్రకారం అధికారులపై దాడి చేశారని చెప్పారు. ప్రభుత్వ విధానాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఉపేక్షించమని తేల్చి చెప్పారు.

అప్రజాస్వామికంగా దాడులు చేస్తే సహించమని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. అధికారం పోయిందనే ఆక్రోషంతో బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా అడ్డుకోవడం బీఆర్ఎస్ కు అలవాటుగా మారిందని విమర్శించారు. అభివృద్ధి అవరోధకులుగా బీఆర్ఎస్ నేతలు తయారయ్యారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏ రోజు ఈ విధంగా వ్యవహరించలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రగతికి పరిశ్రమలు ఎంతో ముఖ్యమని.. ఇందులో భాగంగానే ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేస్తుంటే బీఆర్ఎస్ అడ్డుపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైతుల ఇష్ట ప్రకారమే భూసేకరణ జరగాలి

మొదటిపేజీ తరువాయి

భూసేకరణ రైతుల ఇష్టప్రకారం జరగాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొడంగల్ చుట్టుపక్కల మండలాల్లో ఇంటర్నెట్ సేవలు, కరెంటు బంద్ చేసి వందల మంది పోలీసులను గ్రామాల్లో మోహరించి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కలెక్టర్, అధికారులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని, అయితే రైతులపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని వెల్లడించారు. భూసేకరణ రైతుల ఇష్ట ప్రకారం జరగాలి తప్ప.. బలవంతంగా తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. గతంలో ముచ్చర్లలో ఫార్మా సిటీ కోసం భూములు సేకరించినప్పుడు ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించదని ఆయన గుర్తుచేశారు. అప్పుడు వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు భూములు గుంజుకుని రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులపై దాడిని ఖండిస్తున్నామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. దుద్యాల ఘటన ఘటన వెనుక రాజకీయ కుట్ర ఉందని చెప్పారు. దాడి వెనుక ఎవరున్నా సహించేది లేదని చెప్పారు. ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

## అధికారులపై దాడిని బిఆర్ఎస్ ప్రోత్సహించదు

మొదటిపేజీ తరువాయి

ఏదైనా కంపెనీ ప్రారంభించే ముందు స్థానిక రైతులతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోవాలి.. కానీ రైతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిసే అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతులు రేవంత్ రెడ్డిని కలవానుకుంటుంటే ఆయన పోలీసులను అడ్డుకుపెట్టుకుంటున్నాడని విమర్శించారు. అధికారులను కవచంగా పెట్టి సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పేద రైతులు వందలాది సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్న భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని.. ఆరుగాలం కష్టపడి పంట కోతకొచ్చిన సమయానికి రైతులను అరెస్ట్ చేసి జైల్లో వేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల గ్రామంలో కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై దాడికి కారణం సీఎం రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. నక్సల్ ప్రాంతంలో ఇంటర్నెట్ బంద్ చేయడం చూశాం.. కానీ రైతులు తమ భూముల కోసం కొట్లాడుతుంటే కొడంగల్‌లో ఇంటర్నెట్ బంద్ చేశారన్నారు. ఇంటర్ నెట్ బంద్ చేసి రైతులను తీవ్రవాదులుగా, దేశ ద్రోహులుగా చూస్తున్నారా..? అనేది ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. తన సొంత నియోజకవర్గం కొడంగల్ కొలిమిలా మారితే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీ, కేరళ యాత్రలు చేస్తున్నాడని నిప్పులు చెరిగారు. రైతులను పరామర్శించి సంఘీభావం తెలిపేందుకు వస్తే మమ్మల్ని అడ్డుకున్నారని పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కాగా, వికారాబాద్ జిల్లా లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసిన విషయం తెలిసిందే.

## బెదిరింపులతో రైతులను భయపెట్టలేరు

మొదటిపేజీ తరువాయి

రైతులపై అక్రమ కేసులు సరికాదన్నారు. భూసేకరణ రైతుల ఇష్ట ప్రకారం జరగాలి తప్ప.. బలవంతంగా తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. గతంలో ముచ్చర్లలో ఫార్మా సిటీకోసం భూములు సేకరించినప్పుడు అప్పుడు ప్రతిపక్షంలో ఇదే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని ఆయన గుర్తు చేశారు. అప్పుడు వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు భూములు గుంజుకుని రైతుల నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో ముగిసిన వాదనలు

మొదటిపేజీ తరువాయి

దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరిలపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై షెడ్యూల్ ఖరారు చేయాలని అసెంబ్లీ కార్యదర్శికి హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు సింగల్ బెంచ్ ఆదేశాలను అసెంబ్లీ కార్యదర్శి డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు. స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసే అధికారం న్యాయస్థానాలకు లేదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ దాఖలు చేసిన పిటిషన్?పై సోమవారం (నవంబర్ 12) ఇరు వర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్?పై తీర్పును రిజర్వ్ చేసింది. దీంతో న్యాయస్థానం ఎలాంటి తీర్పు వెలువరిస్తుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 800 పాయింట్ల మేర నష్టం
### 24వేల దిగువకు నిఫ్టీ చేరిక
### డాలర్ మారకంతో పడిపోయిన రూపాయి

**ముంబయి,నవంబర్12**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడితో సూచీలు భారీగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 800 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ మళ్లీ 24వేల దిగువకు చేరింది. ఆసియా మార్కెట్లయిన సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు నేడు నష్టాల్లో ముగిశాయి. దీని ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. గత కొన్ని రోజులుగా మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. సోమవారం రూ.2306 కోట్ల విలువైన షేర్లను విక్రయించడం గమనార్హం. ట్రంప్ విజయం తర్వాత డాలర్ బలపడుతుండడంతో ఇతర కరెన్సీలు బలహీన పడుతున్నాయి. ఈ క్రమంలోనే డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.40 స్థాయికి చేరింది. నిరాశజనక త్రైమాసిక ఫలితాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం లాభాల్లో ట్రేడయినప్పటికీ.. గరిష్ఠాల వద్ద ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో సూచీలు భారీగా కుంగాయి. సాయంత్రం ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు.

## మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి చూపు పరీక్షలు



**కబురు న్యూస్,ఎడపల్లి,నవంబర్ 12 :**
గ్రామీణ ప్రాంతాలలో కంటి చూపు లేని వారికి మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి కరటూరి సూర్యనారాయణ తెలిపారు.మంగళవారం రోజున ఎడపల్లి మండలంలోని దుబ్బా తాండ గ్రామంలో మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలు నిర్వహించారు.జిల్లాలోని బోధన్,బాన్సువాడ,నిజామాబాద్ నియోజకవర్గాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొబైల్ అంబులెన్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.దీని ద్వారా అంబులెన్సులోనే అన్ని సౌకర్యాలతో కంటి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు.ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో ఈ మొబైల్ అంబులెన్స్ ద్వారా కంటి పరీక్షలో నిర్వహిస్తామన్నారు.మంగళవారం దుబ్బా తాండ గ్రామంలో 15 మందికి కంటి ఆపరేషన్లను నిర్ధారించినట్టు పేర్కొన్నారు.వీరికి బోధన్ కంటి ఆసుపత్రిలో ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంగారెడ్డి,కదం ప్రకాష్ రావు ఉన్నారు.

## ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ముందస్తుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

**- గ్రూప్ -3 అభ్యర్థులకు కలెక్టర్ సూచన...**



**కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,నవంబర్ 12 :**
ఆర్మూర్ మార్గంలో అడవిమామిడిపల్లి వద్ద ఆర్.యూ.బీ(రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణం పనులు కొనసాగుతున్న దృష్ట్యా, ఈ నెల 17,18 తేదీలలో గ్రూప్ -3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిర్ణీత సమయానికి ముందే తమకు కేటాయించబడిన పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.అడవి మామిడిపల్లి వద్ద ఆర్.యు.బీ పనులు జరుగుతున్నందున నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 10వ తేదీ వరకు నెల రోజుల పాటు నిజామాబాద్ - ఆర్మూర్ మార్గంలో వాహనాల రాకపోకలను దారిమళ్లించడం జరిగిందని గుర్తు చేశారు.దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రూప్-3 పరీక్షల కోసం ఆర్మూర్ వైపు వెళ్లాల్సిన వారు,ఆర్మూర్ నుండి నిజామాబాద్ వైపు వచ్చే అభ్యర్థులు ప్రత్యామ్నాయ మార్గాలలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉన్నందున నిర్ణీత సమయం కంటే ముందుగానే బయలుదేరాలని కలెక్టర్ సూచించారు.

## పంటఖుర్దు గ్రామంలో విద్యుత్ అధికారుల పొలం బాట...

**కబురు న్యూస్,బోధన్ నవంబర్12..**



బోధన్ విద్యుత్ అధికారులు సోమవారం బోధన్ మండలంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ రమేష్, సేఫ్టీ ఆఫీసర్ ల అధ్వర్యంలో మండలంలోని పంటఖుర్దు గ్రామం రైతుల సమక్షంలో పొలం బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన పొలం బాట అవగాహన సమావేశంలో టెక్నికల్ డిఈ రమేష్ మాట్లాడుతూ రైతులు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వారి పొలాల వద్ద ఉన్న మోటార్లు, స్టార్టర్లు, పివిసి పైపులు, ఐఎస్ఐ నాణ్యతతో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే లో ఓల్టేజి సమస్య రాకుండా ప్రతి రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవడం తప్పనిసరని తెలిపారు. విద్యుత్ పరంగా ఏమన్నా సమస్యలు ఉంటే సంబంధిత విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే పశువులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా రైతులు తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం సంభవించే చోటు ఉంటే స్థానిక అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏడిఈ నగేష్ కుమార్,ఏఈ టౌన్ 2 కళ్యాణ్, సబ్ ఇంజనీర్లు ఓంప్రకాష్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**





**కబురు న్యూస్,నిజామాబాద్, నవంబర్ 12 :**
జిల్లాలో పెద్ద ఎత్తున వరి ధాన్యం దిగుబడులు చేతికందుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.రెంజల్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మంగళవారం సందర్శించారు.ఈ కేంద్రానికి రైతులు తరలించిన ధాన్యం నిల్వలను,వాటి నాణ్యతను పరిశీలించారు.మాయిశ్చర్ మీటర్ ద్వారా ధాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతులు ధాన్యం తీసుకువచ్చేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.సన్నరకం ధాన్యం సేకరిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్, ఇప్పటివరకు ఎంత పరిమాణంలో ధాన్యం కొనుగోలు చేశారు,ఇంకా ఎంత పరిమాణంలో ధాన్యం కేంద్రానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులను ప్రశ్నించారు.గత సంవత్సరం రబీ,ఖరీఫ్ సీజన్లలో కొనుగోలు కేంద్రం ద్వారా సేకరించిన ధాన్యం నిల్వల వివరాల గురించి ఆరా తీశారు.ఈసారి ముందస్తుగా కోతలు పూర్తయిన రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు క్వింటాలుకు సుమారు రూ. 2200 ధర చొప్పున విక్రయించుకున్నారని,కొంత ఆలస్యంగా పంట కోతలు జరిపిన రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెస్తున్నారని,గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం కొంత తక్కువ పరిమాణంలో ధాన్యం వస్తోందని కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.గోనె సంచుల కొరత,రవాణాపరమైన ఇబ్బందులు వంటివి ఏమీ లేవని తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటదివెంట ధాన్యం కొనుగోళ్లు జరపాలని,సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని,ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఏ పీ.డీ సాయాగౌడ్,ఐకెపి డీపీఎం సాయిలు,తహసీల్దార్ శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి

**- మేడ్చల్ జోన్ డీసీపీ కి ఫిర్యాదు చేసిన టీయూడబ్ల్యూజే నేతలు...**
**- మల్లారెడ్డి వార్తలు బైకట్ చేద్దాం...**
**- టీయూడబ్ల్యూజే (ఐజెయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు...**





**కబురు న్యూస్,మేడ్చల్,నవంబర్ 12 :**
జర్నలిస్టులపై దాడులకు తెగబడిన మల్లారెడ్డి ఆసుపత్రి యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(ఐజెయు) మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు తెలిపారు.గత శనివారం మల్లారెడ్డి ఆసుపత్రిలో మృతుల బంధువులు చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఆస్పత్రి వర్గాలు బౌన్సర్లతో దాడులు చేయించారు.ఈ మేరకు సోమవారం పెట్ బషీరాబాద్ లోని మేడ్చల్ జోన్ డిసిపి కోటిరెడ్డిని కలిసి యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ,వైద్యులు ఉండాల్సిన అస్పత్రిలో బౌన్సర్లకు ఏం పని అని ప్రశ్నించారు.నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి ఆవరణలో బౌన్సర్లను నియమించి రోగులను, బంధువులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లారెడ్డి తన పలుకుబడిన ఉపయోగించి విద్య, వైద్య రంగంలో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.మీడియా జోలికొస్తే మల్లారెడ్డిని వదిలిపెట్టే సమస్య లేదని హెచ్చరించారు.తాను ఏం చేసినా చెల్లుతుందని భావిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకం చేసి ఆందోళన చేపడతామన్నారు.మల్లారెడ్డికి సంబంధించిన రాజకీయ,విద్య,ఆస్పత్రిలకు సంబంధించిన వార్తలను బైకట్ చేయాలని మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగాడిసిపి కోటిరెడ్డి మాట్లాడుతూ, సమగ్ర విచారణ జరిపించి యాజమాన్యంపై కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా వైద్య అధికారులను ఆస్పత్రిలో బౌన్సర్ల విషయమై వివరణ తీసుకొని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దయాకర్ రెడ్డి,దామోదర్ రెడ్డి,శివాజీ,జనార్దన్ రెడ్డి,కృష్ణారెడ్డి,కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కోటగడ్డ శ్రీనివాస్,కార్యదర్శి సాయిబాబా,కోశాధికారి శేషారెడ్డి,నాయకులు రాజేందర్,రాజు,ప్రవీణ్,సంతోష్,మాధవ రెడ్డి,బాధిత జర్నలిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్ కలెక్టర్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



**- ప్రజలను రెచ్చగొట్టి అధికారులపై దాడికి పాల్పడ్డ వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలి...**
**- టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 11 :**
విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పై, కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ యొక్క ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మీద కొంతమంది రైతుల ముసుగులో జరిపిన దాడిని టీఎన్జీవో స్ నిజామాబాద్ జిల్లా శాఖ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నా%శీ%, దీనికి నిరసనగా టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం హుస్సేని ఆదేశాల మేరకు టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్,జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అధ్యక్షతన జిల్లా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు సుమన్ కుమార్ మాట్లాడుతూ రైతుల ముసుగులో విధి నిర్వహణలో ఉన్న జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఇలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమని, భవిష్యత్తులో ఇలాంటివి సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని, ఇలాంటి దాడులు సిగ్గుచేటని, దోషులు ఎంతటి వారైనప్పటికీ చట్ట పరిధిలో శిక్షలు విధించాలని తెలిపారు. జిల్లా అత్యున్నత అధికారైన కలెక్టర్ ప్రతీక్ మీద జరిగిన దాడి పట్ల ప్రభుత్వం తప్పకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించుకునే మార్గం ఒకటి తప్పక ఉంటుందని, చట్టాన్ని తమ చేతిలో తీసుకొని అధికారులు, ఉద్యోగుల మీద దాడులు చేయడం హేయమైన చర్యగా, దీనిని జిల్లా సంఘం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, చిట్టి నారాయణరెడ్డి , కేంద్ర బాధ్యులు పోల శ్రీనివాస్, మచ్చుకురి సతీష్, సలహాదారులు ఆకుల ప్రసాద్, కోశాధికారి దినేష్ బాబు,జిల్లా ఉపాధ్యక్షులు కేపీ.సునీత, సంజీవయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, ఉమా కిరణ్ రెడ్డి, విశాల్ రెడ్డి, టీఎన్జీవో నాయకులు పాల్గొన్నారు.

# ప్రతీ ఇంటిని సందర్శిస్తూ పక్కాగా సమగ్ర సర్వే

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**



**కబురు న్యూస్,నిజామాబాద్, నవంబర్ 12 :**



జిల్లా వ్యాప్తంగా ప్రతి నివాస ప్రాంతంలోనూ ఏ ఒక్క ఇల్లు మినహాయించబడకుండా ఇంటింటి సమగ్ర సర్వేను పూర్తి జాగురకతతో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.మంగళవారం రెంజల్ మండల కేంద్రంలో సామాజిక, ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ,కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్ర సర్వే తీరును కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే కోసం హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ సందర్భంగా ఇళ్లకు అతికించిన స్టిక్కర్లపై నమోదు చేసిన వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలో సమాచారాన్ని సేకరిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేశారు.ప్రతి కుటుంబంలోని ఒక్కో వ్యక్తి వారీగా పూర్తి సమాచారాన్ని సేకరించాలని ఎన్యూమరేటర్ కు సూచించారు.ఇప్పటివరకు ఎన్ని ఇళ్లలో సర్వే పూర్తయ్యింది,కుటుంబ వివరాల సేకరణ సందర్భంగా ఏవైనా ఇబ్బందులు ఎదురయ్యాయా? కొత్తగా గమనించిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు.ఏ చిన్న తప్పిదానికి సైతం తావు లేకుండా నిర్ణీత కోడ్ లను పొందుపరుస్తూ స్పష్టమైన సమాచారంతో దరఖాస్తు ఫారాలను పూరించాలని అన్నారు. ప్రతీ ఎన్యూమరేటర్ రోజుకు సగటున కనీసం 15 ఇళ్లను సందర్శిస్తూ,సర్వే ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని సూచించారు.ఎన్యూమరేటర్లకు అవసరమైన సలహాలు,సూచనలు అందిస్తూ,సర్వే ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ చేయాలని సూపర్వైజర్లను ఆదేశించారు.కలెక్టర్ వెంట రెంజల్ తహసీల్దార్ శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాంపూర్ వాసి కురుమ మారుతి



**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**
మలేషియాలో జరిగిన అంతర్జాతీయ ఐటీ సదస్సులో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చేతులమీదుగా ఐటి ఎక్యులెన్సీ అవార్డును బాన్సువాడ మండలంలోని చిన్న రాంపూర్ గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కురుమ మారుతి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డును రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని, తాను పుట్టిన గడ్డకు సేవ చేయడంతో పాటు పారిశ్రామికంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## బహిరంగ సభను విజయవంతం చేయాలి.... కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**కబురు న్యూస్ నాందేడ్ నవంబర్ 12**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ బిలోలిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 14న నిర్వహించే ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ బహిరంగ సభను పార్టీ కార్యకర్తలు, ప్రజలు, రైతులు నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



**కబురు న్యూస్ నాందేడ్ నవంబర్ 12**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా బిలోలి తాలూకాలోని కొండలవాడి గ్రామంలో నాందేడ్ పార్లమెంట్ అభ్యర్థి రవీంద్ర చౌహాన్ కు మద్దతుగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఎంపీ అభ్యర్థితో కలిసి గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి నివర్తి రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ పై దాడి ఆటవిక చర్య

**తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి,తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్...**

**కబురు న్యూస్,నిజామాబాద్ నవంబర్ 12 :**
ఫార్మా కంపెనీ ఏర్పాటు విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్,రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు,తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసి నాయకులు కెంపుల నాగరాజు,తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర నాయకులు హెచ్.రేవంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు.అధికారులపై దాడికి ఉసిగొల్పిన, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ లచ్చిరెడ్డి,తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మలల ఆదేశాల మేరకు నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు.ఇప్పటికే ఈ విషయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.అధికారుల వాహనాలను సైతం ధ్వంసం చేశారని,ఇది దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు.ఇలాంటి దాడులతో ఉద్యోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పెన్ డౌన్ చేస్తామన్నారు.సాక్షాత్తు జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్ మీదనే దాడి జరగడం క్షమించరాని నేరమన్నారు. ఇదో ఆటవిక చర్యగా పేర్కొన్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఆటవిక దాడులు జరగకుండా,ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని కోరారు.నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, కఠిన కారాగార శిక్షలు పడేలా చూడాలన్నారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీ...




**కబురు న్యూస్,బోధన్ నవంబర్12..**
తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫిషరీస్ డిపార్ట్మెంట్ ఆదేశాల మేరకు గంగపుత్ర సొసైటీ సంఘాలకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం బోధన్ పట్టణ బెల్లాల్ చెరువులో ఒక లక్ష 99 వేల 500 చేప పిల్లలను విడుదల చేశారు. బొచ్చ, రవు, బంగారు తీగ మూడు రకాల చేప పిల్లలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా ఫిషరీస్ ఏడి ఏ.ఆంజనేయులు, బోధన్ తహసిల్దార్ విఠల్ ల చేతుల మీదుగా వదిలారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, అంకు దాము, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా, బెల్లాల్ అగ్రికల్చర్ ఈవో కృష్ణవేణి, నిజామాబాద్ అడహక్ కమిటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ కస్వ శ్రీనివాస్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోట అబ్బయ్య, మాగిరి గంగాధర్, ఒంటిజడ భూమయ్య, సుల్తాన్ సాయిలు, మల్లారం నడిపి లక్ష్మయ్య, తోకల చిన్న పోశెట్టి, బొంతల గంగాధర్, దాల్మాల్క శంకర్, సంగం ఏడికి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం... ఎమ్మెల్యే మదన్మోహన్ రావు



**కబురు న్యూస్ ఎల్లారెడ్డి నవంబర్ 12**
రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ రుద్రారం జంగమయ్యపల్లి గ్రామాల్లో జరుగుతున్న కుల గణన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నే రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటు రాజకీయంగా అవకాశాలు రావడంతో పాటు, పేదలు ఆర్థిక అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కుల గణనపై వస్తున్న అపోహలను అసత్యాలను ప్రజలు నమ్మవద్దని, సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కల్కి చెరువులో గుర్తుతెలియని మహిళా శవం లభ్యం

**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**

బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో మంగళవారం అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ శవం ఉందని స్థానికులు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి ఒంటిపై ఎరుపు రంగు చీర, నలుపు రంగు ధరించి ఉన్నదని, మృతురాలికి సంబంధించిన సమాచారాన్ని 87112686167 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలన్నారు.

## ఏబీవీపీ నాయకులను పరామర్శించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ

**- వరుస ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరపాలి... యెండల**

**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**

బాసర త్రిబుల్ ఐటీ లో విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ జరిపించాలని ధర్నా చేసిన ఏబీవీపీ నాయకులపై సిఎస్ఓ రాకేష్ ప్రైవేట్ సిబ్బందితో దాడి చేయించి గాయపరచడం అమానుషమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నికల లక్ష్మీనారాయణ అన్నారు. ఐఐఐటీ ప్రవేటు సిబ్బంది దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏబీవీపీ నాయకుడు సాయికుమార్ ను మంగళవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండల లక్ష్మీనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిబుల్ ఐటీ విద్యాసంస్థ వరుస ఆత్మహత్యలకు నిలయంగా మారిందని, ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాల్సింది పోయి, ఏబీవీపీ నాయకులపై దాడులకు ప్రేరేపించిన రాకేష్ పై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, ఆత్మహత్యలపై న్యాయ విచారణ జరిపించి కమిషన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**

బాన్సువాడ మండలంలోని కొత్త బాద్ గ్రామంలో హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులను నిర్వాహకులు శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి గణేష్, మాజీ జడ్పిటిసి కొత్తకొండ భాస్కర్, వైద్యులు,జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి అంబర్ సింగ్, మోహన్, ఆనంద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన రెవిన్యూ ఉద్యోగులు



**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**
బాన్సువాడ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం తహసిల్దార్, సబ్ కలెక్టర్ కార్యాలయ రెవెన్యూ ఉద్యోగులు ఇటీవల వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీలకు భూసేకరణ విషయంలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా కలెక్టర్ పై రెవిన్యూ ఉద్యోగులపై గ్రామస్తులు చేసిన దాడికి నిరసనగా రెవిన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై దాడులు చేయడం సమంజసం కాదని, ప్రజాభిష్టాన్ని తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరప్రసాద్, ఆర్ఐ అశోక్, అంజు, సంగమేశ్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షున్ని సత్కరించిన కౌన్సిలర్లు



**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**
రాష్ట్ర పద్మశాలి సంఘం ఉప అధ్యక్షునిగా మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్బంగా వైస్ చైర్మన్ జూబేర్, కౌన్సిలర్లు బాడి శ్రీనివాస్ ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జూబేర్, కౌన్సిలర్లు బాడి శ్రీనివాస్,అమీర్ చావుస్, హకీమ్, గొంట్యల బాలకృష్ణ, నార్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం...



**కబురు న్యూస్,బోధన్ నవంబర్12..**
బోధన్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం బోధన్ ఆధ్వర్యంలో మెడివిజన్ ఐకేర్ సెంటర్ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. శిబిరానికి పరీక్షల కోసం వచ్చిన వారికి కంటి వైద్యులు దీప్ సింగ్ కంటి పరీక్షలు చేపట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. మెడివిజన్ సిబ్బంది ఆంజనేయులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి రాజేశ్వర్, సాయిలు, ఇస్మాయిల్, పాపారావు, బాబు రావు, కిషన్, అన్నమేరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు దినపత్రిక
కబురు
KABURU TELUGU DAILY



# కాంగ్రెస్ పార్టీవి విజయోత్సవాలు కాదు..అవి రాక్షసోత్సవాలు

- కాంగ్రెస్ ఏడాది పాలన కమిషన్లకు కసరత్తులు చేయడానికి సరిపోయింది...
- ప్రజాపాలన దరఖాస్తులు మూసిలో ముంచారా..? ఆరు గ్యారంటీలు గంగలో కలిపారా??
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్





**కబురు న్యూస్,నిజామాబాద్,నవంబర్ 12 :**

వంద రోజుల్లో అమలు చేస్తానన్నా ఆరు గ్యారంటీలకు ఒక్క గ్యారంటీ పూర్తిగా అమలు చేసిన దిక్కు లేదని,కాంగ్రెసువి విజయోత్సవాలు కావని రాక్షసోత్సవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ విమర్శించారు.భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ,కాంగ్రెస్ ఏడాది పాలన కమిషన్లకు కసరత్తులు చేయడానికి,ఉన్నది లూటి చేయడానికే సరిపోయిందని,కాంగ్రెస్ ప్రజాపాలన పేరుతో స్వీకరించిన దరఖాస్తులు మూసిలో ముంచారా..? ఆరు గ్యారంటీలు గంగలో కలిపారా అని ప్రశ్నించారు.తెలంగాణ సమాజం మొత్తం కాంగ్రెస్ ఏడాది పాలన చూసి అసహ్యించుకుంటున్నారని 6 నెలలకే కాంగ్రెస్ పార్టీ పైన నమ్మకం కోల్పోయి 8 పార్లమెంట్ స్థానాలలో బిజెపిని గెలిపించడం జరిగిందన్నారు.ఈ రోజు ఏ మొఖం పెట్టుకొని ఉత్సవాలని వస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు,ఏడాది పాలన మొత్తం కమిషన్లకు కసరత్తులు చేయడం,ఉన్నది లూటి చేయడానికే సరిపోయిందని అన్నారు.ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్ల పాలన తెలంగాణాలో ఏడాది పాలన దోచుకోవడంలో బ్రిటిషోన్ని మించిపోయిందని ఏద్దేవా చేసారు. రైతన్నలకు రుణమాఫీ కాక పండించిన పంటలు కల్లాలలో ఉండి అకాల వర్షానికి నష్టపోయి రైతు కన్నీళ్లు పెడుతుంటే,కాంగ్రెస్ కు విజయోత్సవాలా..? ఏది మీ రైతు భరోసా ఎక్కడ మీ పంట బోనస్...? అని నిలదీశారు,కాంగ్రెస్ చేసేవి విజయోత్సవాలు కావు రాక్షసోత్సవాలు అని అన్నారు.యావత్ తెలంగాణ సమాజం మీరు చేసే వికృత చేష్టలకు సిగ్గుపడుతుందని ఏ వర్గం ప్రజలు మీతో సంబరాలు చేసుకోవాలో రేవంత్ సమాధానం చెప్పాలన్నారు. మహాలక్ష్మి పథకం కింద మా ఆడబిడ్డలకు 2500 ఇచ్చినవని సంబరాలు చేసుకోవాలా? చేయూత కింద మా అవ్వ,తాతలకు పెన్షన్ 4 వేలకు పెంచినవ్ అని ఉత్సవాలు చేసుకోవాలా? ఇళ్ళు లేని గరిబోళ్లకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిచ్చినవని సంబరాలు చేస్తున్నారా? యువ వికాసం పథకం కింద విద్యార్థులకు విద్య భరోసా 5 లక్షలు ఇచ్చినవని సంబరాలు చేసుకోవాలా? నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 4వేలు ఇస్తున్నావని సంబరాలు చేయాలా..? చదువుకునే ఆడపిల్లలకు ఎలక్ట్రికల్ స్కూటీ ఇచ్చినవ్ అని ఉత్సవం చేయమంటావా..? పెళ్ళైన మా ఆడబిడ్డలకు తులం బంగారం ఇచ్చినవ్ అని ఉత్సవ పండగలు చేయాలా.? ముఖ్యమంత్రి రేవంత్ కు,కాంగ్రెస్ నాయకులకు ఉత్సవాలు చేయడానికి సిగ్గుండాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఇచ్చిన గ్యారంటీలను,హామీలను డైవర్ట్ చేసే ప్రయత్నం చేద్దాం అనుకున్నారు కాని ప్రజలు ఇచ్చిన గ్యారంటీలు,హామీలు ఏమైనాయని అధికారులను ప్రశ్నిస్తున్న పరిస్థితి మనం చూస్తున్నామన్నారు.రైతు రుణమాఫీ,రైతు భరోసా ఇవ్వలేదు మా భూమి వివరాలు ఎందుకు చెప్పాలి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు.ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులు మూసిలో ముంచారా...!ఆరు గ్యారంటీలను గంగలో కలిపారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు.నేను కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేస్తున్న ప్రజల ఆస్తుల వివరాలు,వారి జీతాబత్యాల వివరాలు తెలుసుకునే ముందు దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకుల ఆస్తుల పైన,జీతబత్యాల శ్వేతపత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు.సర్వేకు బిజెపి వ్యతిరేకం కాదని ఇంటింటికి వెళ్లి రుణమాఫీ కాని రైతులు ఎందరు ఉన్నారో,రైతు భరోసా,పంట భీమా వర్తించక ఎందరు రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారో తెలుసుకోని వాళ్లకు న్యాయం చేయలన్నారు. వచ్చిన తెలంగాణలో పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగాలు రాక ఎందరు నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారో తెలుసుకుని వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తెలంగాణలో ఇప్పటికి గూడు లేక గోసటిల్లుతున్న గరిబోళ్ళని గుర్తించండి వారికీ నిలువ నీడనివ్వండి అన్నారు.ఇప్పటికి రేషన్ కార్డు లేని కుటుంబాలు ఎన్నో ఉన్నాయని పెన్షన్ రాని అవ్వ,తాతలు ఉన్నారని వారికీ మీరు తక్షణమే న్యాయం చేయలని డిమాండ్ చేసారు.అంతే కాని కులగణన పేరుతో, కుటుంబ సర్వే పేరుతో,మీ సోనియామ్మ జన్మదినం పేరుతో కాలయాపన చేస్తే మేము చూస్తూ ఊరుకోమని,మీరు ఇచ్చిన గ్యారంటీలు,హామీలు అమలు చేసేవరకు విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ళ లక్ష్మీనారాయణ. బిజెపి కార్పొరేటర్ మాస్టర్ శంకర్, బిజెపి నాయకులు,ఇల్లందుల ప్రభాకర్,ఇప్పకాయల కిషోర్,ఆనంద్ బట్టికిరి, భాస్కర్ శివ నూరి,మఠం పవన్, పవన్ ముందడ,మారవార్ కృష్ణ,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎబివిపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



**కబురు న్యూస్,నిజామాబాద్,నవంబర్ 12 :**
ఎబీవీపీ నాయకులపై దాడిని ఖండిస్తూ,నగరంలోని ధర్నాచౌక్ లో ఎబీవీపీ కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో విద్యార్థులను నరకయాతనంగా హింసిస్తున్నారని ఆరోపించారు.బాసర త్రిబుల్ ఐటీలో ఒక విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని నిరసనగా ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ విద్యార్థి నాయకులు శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తే అక్కడ ఉన్న సిఎస్ఓ రమేష్ సెక్యూరిటీ సిబ్బందిని ఉసిగొల్పి విద్యార్థులపై ఇనుప రాడ్లతో కర్రలతో దాడి చేయడం ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.బాసర త్రిబుల్ ఐటీ లో రెండు మూడు సంవత్సరాల నుండి వరుస సంఘటనలు వరుస ఆత్మహత్యలు జరుగుతున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అలాగే ప్రశ్నించే విద్యార్థులపై దాడి చేస్తున్నారన్నారు. విద్యార్థి నాయకులు యూనివర్సిటీ విద్యార్థులకు న్యాయం జరగాలని ప్రశ్నిస్తే ఏబీవీపీ నిర్మల్ నగర కార్యదర్శి సాయికుమార్ పై , విద్యార్థి నాయకుల పై తీవ్రంగా దాడి చేయించారన్నారు. విద్యార్థి నాయకులపై దాడి చేయించిన సిఎస్ఓ రాకేష్ ని వెంటనే విధుల నుండి తొలగించి, విద్యార్థి నాయకుల పై దాడి చేసిన సెక్యూరిటీ సిబ్బంది పై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి న్యాయం చేసి ఆత్మహత్యకు కారకులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ, నాయకులు అమరాచారి, సాయికుమార్, ప్రవీణ్, మహేష్, అజయ్, సమీర్, దినేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతిప్రియ తల్లిదండ్రులను పరామర్శించిన ఎన్ఎస్ యుఐ నాయకులు



**కబురు న్యూస్,నిజామాబాద్, నవంబర్ 12 :**

బాసర త్రిబుల్ ఐటిలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి ప్రియ తల్లిదండ్రులను బిచ్కుంద మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఎన్.ఎస్.యు.ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో మంగళవారం పరామర్శించారు. స్వాతి ప్రియ మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామన్నారు.స్వాతి ప్రియ తల్లిదండ్రులతో మాట్లాడినప్పుడు తను చాలా బాగా చదువుతుందని క్రమశిక్షణ కలిగిన అమ్మాయి అని త్రిబుల్ ఐటీ లో సీటు సాధించిందంటే చాలా ప్రతిభ ఉన్న విద్యార్థి స్వాతి ప్రియ అని అర్థమైందని అలాంటి ఉజ్వల భవిష్యత్తు ఉన్న స్వాతి ప్రియ వ్యక్తిగత కారణాలవల్ల ఆత్మహత్య చేసుకోవడం మమ్మల్ని తీవ్రంగా కలిచి వేసిందని ఆయన అన్నారు.విద్యార్థులు ఎవరైనా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని ప్రతిదానికి ఆత్మహత్య సమాధానం కాదని మీపై ఆశలు పెంచుకున్న మీ తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల నమ్మకాన్ని కలల్ని ఆశయాలని అర్ధాంతరంగా ఆత్మహత్య చేసుకుని వారికి కడుపుకోతను మిగిల్చొద్దని ఆయన అన్నారు. పరామర్శించిన వారిలో ఎన్.ఎస్.యు.ఐ నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ ఇర్ఫాన్, సాయికిరణ్, హరీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి బోధన్ అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యాన్నదానం...



**కబురు న్యూస్,బోధన్ నవంబర్12..**
బుధవారం నుండి బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు నిత్యాన్నదాన కమిటీ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప మాలదారుల, భక్తుల సౌకర్యార్థం నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమం చేయదలుచుకునే దాతలు 5,200 రూపాయలను చెల్లించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# ఇంటింటి కులగణన సర్వే ను పరిశీలించిన ఎంపీఓ



**కబురు న్యూస్ బాన్సువాడ నవంబర్ 12**
బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి కులగణన సర్వేను మంగళవారం ఎంపీవో సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేలో ఎలాంటి తప్పిదాలు లేకుండా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని ఎన్యుమరేటర్స్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ షాబుద్దీన్, మంత్రి కాశిరాం, తదితరులు పాల్గొన్నారు.

# డీఈవోను సన్మానించిన ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్స్



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 12 :**
డిఇవోగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ ను మోడల్ స్కూల్స్ అండ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్స్ మంగళవారం కలిసి శాలువా పూల బొకేతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా డిఇఓ మాట్లాడుతూ,ఆదర్శ పాఠశాల,కళాశాలలో విద్యాబోధన బాగా జరుగుతుందని,వీటి నుండి ప్రతి సంవత్సరం మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.ఈ సంవత్సరం కూడా పదవ తరగతి,ఇంటర్మీడియట్ లో మంచి ఫలితాలు వచ్చేటట్టు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సూచించారు.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు సుధారాణి,ప్రవీణ్ కుమార్,డాక్టర్ దశరథ్ యాదవ్,శ్యాం కుమార్,ఫెరోజ్ ఖాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,నవంబర్ 12 :**
ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అంకాపూర్ లోని ప్రొద్దుటూరు సదానంద రెడ్డి ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం మెడికవర్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో చాతి వైద్య నిపుణులు డాక్టర్ ప్రశాంత్ వృద్ధులకు బిపి,ఆర్ బి ఎస్,ఈసీజీ వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.అనంతరం ఉచితంగా మందులను అందజేశారు.ఈ శిబిరంలో ఆశ్రమంలోని వృద్ధులు 50 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

# ఆదరణ లేని దేవాలయాలను శోధిస్తున్న హిందూ చైతన్య వేదిక దేవపూర్

- హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరూ నుదుటన తిలకం ఇంటి పైన కాషాయపు జెండా పెట్టాలి.
- సంఘటితమే మహాబలం ధర్మో రక్షతి రక్షితః అంటున్న సంఘ సభ్యులు
- హిందువులను సంఘటితం చేయడమే ప్రధాన లక్ష్యం అంటున్న హిందూ సంఘటిత వేదిక



కబురు న్యూస్, మంచిర్యాల నవంబర్ 12

మంచిర్యాల జిల్లా దేవాపూర్ పట్టణ ప్రాంతవాసులు హిందువులను చైతన్యం చేయడంలో ఒక వేదిక ఏర్పాటు చేసుకొవడం జరిగింది.హిందూ చైతన్య వేదిక దేవపూర్ సభ్యులు మాట్లాడుతూ దేవపూర్ చుట్టుపక్కల ప్రాంత గ్రామాలలో హిందువులను చైతన్యం చేయడానికి ఒక మంచి సంకల్పంతోనే దేవుడి మీద నమ్మకం ఉంచి నిరుపయోగంగా పూజలు అందుకోలేని దేవాలయం పూజలు పునర్నిర్మాణం చేసే విధంగా ఒక మంచి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కొంతమంది సంఘటితమై పూజలు చేయకుండా నిరుపయోగంగా ఉన్న ఆలయాలు సందర్శిస్తూ ఆ ఆలయాల గొప్పతనం ఆలయాలు ఎప్పుడు నిర్మించారు ఎందుకు ప్రతిష్టాపన చేయలేకపోయారు వివరాలు సేకరించి పొంద పరచడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా ఎవరు పూజలు చేయలేని ఆలయము చుట్టుపక్కల అపరిశుభ్రత వాతావరణం శుభ్రపరిచి భగవంతుని రూపాన్ని గంగా నీళ్లతో అభిషేకించి గంధము, పసుపు, కుంకుమ, చందనముతో అలంకరణ చేసి కొబ్బరికాయ నైవేద్యం పెడుతున్నామని తెలియజేశారు.గుడికి వచ్చిన భక్తులకు అక్కడ ప్రాంత వాసులకు నిత్యం గుడిలో దేవునికి అభిషేకం దీప దూప నైవేద్యాలు సమర్పించాలని స్పష్టం చేశారు. మానవునిగా మనం జన్మ ఎత్తి భగవంతుని కృపతో జీవనం సాగిస్తున్నామని మనం ఉదయం లేచిన నుండి పడుకునే వరకు జీవించడం కోసమే పోరాటం చేస్తున్నామని నిత్య జీవన పోరాటంలో కొంత సమయం వెచ్చించి భగవంతుని గుడి శుభ్రపరిచి రోజు దీప, దూప, నైవేద్యాలు సమర్పించినచో భగవంతుని కృప మన పైన ఉంటుందని వచ్చిన భక్తులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంచినీళ్ల గణేష్ కుమార్, కొమురంలాల్, తొగరి గజానంద్, పణనగంటి కృష్ణమోహన్, వెడమ బాపురావు, రొడ్డ లక్ష్మి, ఆర్.ఎం.పి వెడమ రాజేశ్వరెడ్డి,కోడప భీమ్ రావు, పెంచాల రాజకుమార్,తోట మనోజ్,ఏలం రాజకుమార్,కొమురవెల్లి సత్యనారాయణ,గుండా శ్రీనివాస్, పెదముమురళి మహారాజ్,రామిల్ల దిలీపు,మెరుగు నాగరాజు, కనక రాము,కురుశింగ అచ్యుతరావు, కురుశింగ జంబారావు,వెంబడి కిషన్,తదితరులు పాల్గొనడం జరిగింది.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలి



:- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్

కబురు న్యూస్, భువనగిరి :-

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదగిరి పల్లి,మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తోన్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ తీరును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గంగాధర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్ లు సర్వే చేసే విధానాన్ని, అడిగే ప్రశ్నల తీరును, సర్వే ఫార్మ్ లో కుటుంబాల వివరాల నమోదును క్షుణ్ణంగా పరిశీలించి,ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఎలాంటి తప్పులు లేకుండా కుటుంబాల వివరాలను నమోదు చేయాలన్నారు. అదే విధంగా సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# క్రీడా రంగానికి కేరాఫ్ గా కుత్బుల్లాపూర్ ను అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ...



కబురు న్యూస్, కుత్బుల్లాపూర్, నవంబర్ 12

125 – గాజుల రామారం డివిజన్ గాజులరామారం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న క్రీడా మైదాన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని మౌలిక వసతులు కల్పించి క్రీడలు అంటే కుత్బుల్లాపూర్, కుత్బుల్లాపూర్ అంటే క్రీడలు అనే విధంగా కుత్బుల్లాపూర్ ను అభివృద్ధి పరచాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఈ క్రిష్టప్ప, డిఈ రూపా దేవి, ఏఈ కళ్యాణ్, కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, డివిజన్ ఉపాధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, బోయినీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.......

# బోధన ఏకాదశి విశేషంగా మహా దిపాలంకరణ



కబురు న్యూస్, వర్గల్ నవంబర్ 12,

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం నాచగిరి కార్తీకమాసం పురస్కరించుకొని మంగళవారం బోధన ఏకాదశి విశేషంగా మహా దిపాలంకరణ కార్యక్రమము భక్తులందరి చేత నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి ఈ నెలరోజులు కూడా దేవాలయం నుంచి దీపానికి కావలసినటువంటి సామాగ్రి అలాగే వచ్చినటువంటి ప్రతి ముత్తైదవ కు సుమంగళ ద్రవ్యాలు ఫలము పుష్పము దేవాలయం నుండి ఇవ్వడం జరిగింది అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీమతి ఎస్ అన్నపూర్ణ సిబ్బంది సుధాకర్ నరేందర్ గౌడ్,,పాండు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగురం కుమార్ ను కలిసిన పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్



కబురు న్యూస్, ఉప్పల్ :-

ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నియమించబడిన ప్రొఫెసర్ మొలుగురం కుమార్ ని, పెద్దలు పీసీసీ డెలిగేట్ మాజీ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రణాళిక బోర్డు సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ ప్రత్యేకంగా కలిసి వైస్ ఛాన్సలర్ ని ఘనంగా షాలువాతో సన్మానించినారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రలో ఒక దళిత జాతి మాదిగ బిడ్డను ను వైస్ ఛాన్సలర్ ఎన్నుకోవడం,చాలా శుభ పరిణామమని, ఆయన ఉద్యోగ ధర్మంలో ఎన్ని కఠిన పరీక్షలు ఎదుర్కొని కూడా చదువుకున్న పేద ప్రజలకు ఎంతో సాయం చేసినారని వారన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాహుల్ గాంధీ సూచనలతో బడుగు బలహీన వర్గాలకు ఇలాంటి అవకాశాలు దొరకడం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజయ్య,జగన్ భువనగిరి మండల ఆదర్శ రైతుల అధ్యక్షులు మొలుగు లక్ష్మయ్య, అల్లూరి రవీంద్ర చారి,శేఖర్, మహమ్మద్ తయార్, వెంకటేష్, నరేష్, స్వామి, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

:- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి



కబురు న్యూస్, భువనగిరి :-

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మంగళవారం ఆలేరు మండలం పరిధిలోని ఏఎంసి (ఎఫ్ పి ఓ)ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , కొల్లూరు గ్రామంలోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ ధాన్యమును ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మకం జరిపి మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులు పండించిన ధాన్యం యొక్క తేమ శాతం పరిశీలించారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం తేమ శాతం చూడాలన్నారు, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలు కేంద్రానికి తేవాలని ఆయన అన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులోకి తరలించేలా చూసుకోవాలని కేంద్రం నిర్వాహకులకు. సూచించారు. కొనుగోలు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని రికార్డులలో రైతుల వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు తహసిల్దార్ అంజిరెడ్డి,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ట్రాస్మా రాష్ట్రస్థాయి నూతన నూతన కార్యవర్గం ఎన్నిక

– మంచిర్యాల జిల్లా వాసులకు సమోచిత స్థానం





కబురు న్యూస్, మంచిర్యాల జిల్లా నవంబర్ 12

నేటి తరం మంచిర్యాల్ జిల్లా వాసులకు సముచిత స్థానం దక్కింది.మంగళవారం హైదరాబాదులో ట్రస్మా రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించడమైనది,ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ట్రస్మా బాధ్యులుహాజరయ్యారు,ఈ సందర్భంగా ట్రస్మ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంచిర్యాల జిల్లాకు చెందిన మల్లెత్తుల రాజేంద్రపాణి ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పెట్టం మల్లయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా చిందం చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.మల్లెత్తుల రాజేంద్ర పాణి,గత 30 సంవత్సరాలుగా ప్రైవేటు పాఠశాలల అభివృద్ధి కోసం చేస్తున్న కృషి వల్ల ఈ పదవి వరించింది అన్నారు.ఈయన గతంలో జిల్లాలో సింగపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పనిచేసి ఎంతోమంది ప్రజల ఆధార అభిమానాలు చురగున్నారు.ఈ సందర్భంగా మల్లెతుల రాజేంద్ర పాణి,మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి,రాష్ట్ర సెక్రటరీ అనిల్ కుమార్,ట్రెజరర్ శ్రీకాంత్ రెడ్డి కి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా,మంచిర్యాల జిల్లాకు చెందిన పెట్టం మల్లయ్య ని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్షేట్టిపేటకు చెందిన చిందం చంద్రశేఖర్ ని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గా నియమించారు.ఎన్నికైన జిల్లా నాయకులు జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడుతామని తెలియజేశారు.వీరి ఎన్నిక పట్ల జిల్లాలోని ట్రస్మ నాయకులు,జిల్లా కరస్పాండెంట్లుహర్షం వ్యక్తం చేశారు.

# సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్..



కబురు న్యూస్, కుత్బుల్లాపూర్ నవంబర్ 12

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్టలో జెకె శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సదర్ ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70, 80 సంవత్సరాల నుంచి సదర్‌ను యాదవులు ఎంతో ఘనంగా నిర్వహిస్తూ వస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.ఈ సదర్‌ను అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు......

# ఘనంగా లక్ష దిపోత్సవం...



–ప్రత్యేక పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్..

కబురు న్యూస్, కంటోన్మెంట్

న్యూ బోయిన్ పల్లి లోని భోళా శంకర ఆలయంలో పురస్కరించుకొని న ఆలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ పాల్గొని స్థానిక నేతలు భక్తుల తో కలిసి దీపారాధన చేశారు. భక్తుల శివనామస్మరణ తో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది.అనంతరం భక్తులు శివుడి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు.ఈ కార్యక్రమంలో అరుణ్ యాదవ్,టీంకు గౌడ్, ముకేశ్ యాదవ్, రాధాకిషన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ బాలానగర్ వారి ఆధ్వర్యంలో మంగళ వారం బోయిన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్..ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిస్వార్థంగా చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందనీయమన్నారు. అక్కడ వైద్యులు పిల్లల కంటిని పరీక్షించడాన్ని స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. ఈ శిబిరంలో కేవలం విద్యార్థులకే కాక వారి తల్లిదండ్రుల కూడ కంటి పరీక్షలు చేయడాన్ని ఆయన అభినందించారు.లయన్స్ క్లబ్ వారు చేస్తున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలను నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఇతర అన్ని స్కూళ్ల లో కూడా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్ ని లైన్స్ క్లబ్ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు.




# గజ్వేల్ మండలం లో బిజెపి పార్టీ 1000 సభ్యత్వాలు

– గజ్వేల్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేష్ గౌడ్–



కబురు న్యూస్, గజ్వేల్ నవంబర్ 12,

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ మండలంలో బిజెపి పార్టీ నుండి మొట్టమొదటి 1000 సభ్యత్వాలు విజయవంతంగా పూర్తి చేసిన గజ్వేల్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పంజాల వెంకటేష్ గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆదేశాల మేరకు గజ్వేల్ మండలంలో తక్కువ రోజుల్లోనే 1000 సభ్యత్వాలు విజయవంతంగా పూర్తి చేసిన మొట్టమొదటి వ్యక్తిగా నాకు లభించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. బిజెపి పార్టీ పెద్దలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ సభ్యత్వాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. పార్టీ పెద్దల నుండి అభినందనలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రజలకు, యువతకు బిజెపి పార్టీ గురించి అవగాహన కల్పించడం జరిగింది. ప్రజలు యువతి యువకులు బిజెపి పై నమ్మకం తోటి సభ్యతలు తీసుకుంటూ పార్టీకి అండ దండగ ఉంటామని తెలియపరుస్తూ సభ్యత్వాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు. బిజెపి పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన కర్తవ్యాన్ని నెరవేరుస్తానని అని తెలిపారు. దీనితోటి బిజెపి పార్టీ పైన నాపైన మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. బిజెపి పార్టీ కోసం ఎండనగా,వాననక, పగలు రాత్రి తేడా లేకుండా పార్టీ కోసం 100 శాతం కష్టపడతానని అన్నారు.

# బీజేపీ హుజూరాబాద్ సంస్థగత ఎన్నికల వర్క్ షాప్..



కబురు న్యూస్, హుజురాబాద్, :నవంబర్ 12,



హుజురాబాద్ భారతీయ జనతా పార్టీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో పట్టణ సంస్థగత ఎన్నికల వర్క్ షాప్న మరియు పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు కొమురయ్య , పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు బూత్ స్థాయి ఆ పై నాయకులు తమ రిఫరల్ కోడ్ పై 100 సభ్యత్వాలు తప్పకుండ నిర్ధిష్ట సమయం లో పూర్తి చేయాలనీ కోరారు.బూత్ అధ్యక్షులు నియమించడానికి నాయకులు కార్యకర్తలు సంసిద్ధం కావాలని కోరారు.ప్రతి కార్యకర్త పార్టీ కోసం సంస్థగతంగ పని చేయాలని వివరించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు బిజెపి జిల్లా పదాధికారులు పట్టణ నాయకులు శక్తి కేంద్ర ఇన్చార్జులు బూత్ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మెతుకు సత్యం



కబురు న్యూస్, హుజురాబాద్/:నవంబర్ 12,

హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామ కారోబారి చిలుక మారి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం రోజున పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు మెతుకు సత్యం మృతుని కుమారులు చిలుక మారి సత్యరాజ్ పాత్రికేయుడు, మరో కుమారుడు పద్మశాలి సంఘం కరీంనగర్ జిల్లా నాయకుడు చిలుకమారి శ్రీనివాసులను పరామర్శించారు అలాగే రాజమౌళి చిత్రపటానికి పూలతో శ్రద్ధాంజలి ఘటించారు ఈ కార్యక్రమంలో ఓడ్నాల రవీందర్, దికొండ లక్ష్మీనారాయణ, సబ్బని రాజేందర్ అలుసా భద్రయ్య, సబ్బని రవీందర్, చిదురాలచక్రపాణి, చేరాల శ్రీనివాస్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి కుటుంబ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి... స్పెషల్ ఆఫీసర్ నాగ ఐలేశ్వర్





కబురు న్యూస్, జమ్మికుంట నవంబర్ 12

జమ్మికుంట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, మరియు కుల సర్వే సమగ్ర కుటుంబ సర్వే మంగళవారం స్పెషల్ ఆఫీసర్ నాగ ఐలేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ లు ఆకస్మిక తనికి నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, సి ఎల్ ఆర్పిలు, అర్పీలు సర్వేలో భాగంగా పట్టణంలోని వార్డులలో ఇంటింటా తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ నాగ ఐలేశ్వర్, మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్ లు మాట్లాడుతూ సర్వే చేసేటప్పుడు ఫారంలో తప్పిదాలు లేకుండా సర్వేను పూర్తి చేయాలన్నారు. సర్వే నిర్వహిస్తున్న అధికారులు విధిగా రోజు వారిగా 1200 ఇండ్లు చేయాలని, నిన్నటి వరకు 1915, సోమవారం రోజు 30 వార్డులలో 1008 ఇండ్లు సర్వే చేసారని, ఈ రోజు 1090 , మొత్తం 3,005. మిగితావి త్వరితగతిన సర్వే పూర్తి చేయాలనీ సూచించారు. ఎలాంటి తప్పిదాలు లేకుండ, నీట్ గా సర్వే పూర్తి చేయాలనీ, ఫారం లో జిల్లా, మండల, మునిసిపల్ కోడ్ లు నమోదు చేస్తూ, ఎటువంటి సందేహాలు ఉన్న మీ సూపర్ వైజర్లతో అడిగి తెలుసుకొని రాయాలని, ఇష్టానుసారంగా రాయకూడదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు మేనేజర్ జి రాజిరెడ్డి, టీపీఓ శ్రీధర్ ,టీ పి ఎస్ ప్రదీప్ కుమార్ , అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, వాణిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# విద్యారంగంపై సర్కార్ చిన్న చూపు

- ఫీజు రియంబర్స్మెంట్ విడుదల పట్ల ప్రభుత్వం వివక్షతను విడనాడాలి
- సీఎం వద్ద విద్యాశాఖ ఉన్న సమస్యల పరిష్కారం లేదా?
-ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్



కబురు న్యూస్, జమ్మికుంట నవంబర్ 12

విద్యార్థుల పట్ల వివక్షత చూపుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా, పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయకుండా విద్యారంగంపై రాష్ట్ర సర్కార్ చిన్న చూపు చూస్తుందని సిఎం వద్దే విద్యాశాఖ ఉన్న సమస్యల పరిష్కారం ఇంకెప్పుడు అని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ ప్రకటన లో అన్నారు. ఈ సందర్భంగా రామారపు వెంకటేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు రూ. 7650 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటూ తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఎన్నికల ముందు పదే పదే మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పి నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని, సర్కారు ఫీజులు చెల్లింపులు చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అదేవిధంగా విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని, విద్యార్థుల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు మనుగడ సాధించలేవని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను మొత్తం విడుదల చేయడంతో పాటు విద్యారంగంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని, జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దశల వారీగా ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

# వికారాబాద్ జిల్లా కలెక్టర్, మీద దాడి ఖండిస్తూ




- జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జిలతో నిరసన

కబురు న్యూస్, జమ్మికుంట నవంబర్ 12

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు నల్ల బాధ్యులతో నిరసన తెలుపడం జరిగింది తహసిల్దార్ రమేష్ బాబు మాట్లాడుతూ . ఒక జిల్లా కలెక్టర్ పై దాడులు చేయడం అధికారులపై దాడులు చేయడం సరికాదని ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారులు పనిచేయడం జరుగుతుందని అన్నారు వికారాబాద్ జిల్లాలో కొడంగల్ నియోజకవర్గంలో లగ్గిచర్ల, పోలేపల్లి, హకీం పేట మూడు గ్రామాల్లో ఫార్మా గ్రామంలో ఏర్పాటు చేయటం కోసం మూడు వేల ఎకరాల సేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు .ఈ క్రమంలో చాలామంది రైతులు భూములను స్వచ్ఛందంగా ఇచ్చేశారు.వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులు, పోలీసులు లగ్గిచర్ల గ్రామంలో రైతుల నుండి భూములను సేకరించటం కోసం రెండు కిలో మీటర్ల దూరంలో తాత్కాలిక సభను నిర్వహించటం కోసం ప్రయత్నం చేశారు. అయితే ఇది గ్రామానికి దూరంగా ఉండటం కారణంగా రైతులు, గ్రామస్తులు ఈ సభపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామానికి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణకు ప్రయత్నించగా ఒక్కసారిగా ఆందోళన మొదలైంది.దీంతో పోలీసులు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నేపథ్యంలో కలెక్టర్ ను అక్కడి నుండి సురక్షిత ప్రాంతానికి తరలించారు. . కలెక్టర్ అధికారులపై దౌర్జన్యం న్యాయం కాదని జమ్మికుంట తహసిల్దార్ రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ బాబు నీలం శ్రీనివాస్ ఆర్ఐ శంకర్ విఆర్ఏలు వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిది..

- తోటకూర వజ్రెష్ యాదవ్

కబురు న్యూస్, దినపత్రిక మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, .నవంబర్ 12

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. మంగళవారం నాడు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాలకు చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను అందచేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మూడు చింతలపల్లి మండల్ అధ్యక్షుడు బొమ్మలపల్లి నరసింహ యాదవ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్పర్సన్ పావని జంగయ్య యాదవ్,బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, దమ్మైగూడ కౌన్సిలర్ వెంకటేష్,బొక్క ప్రభాకర్ రెడ్డి,విశ్వం,బొమ్మకు శ్రీనివాస్,రాధా కృష్ణ,జై. నరసింహులు, బొక్క సంజీవ







రెడ్డి, వెంకటేష్,భూపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

1. సాయి కుమార్ ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ ఎఫ్ సి నగర్ 60000
2. రాజేందర్ రెడ్డి ఘట్కేసర్ మున్సిపాలిటీ బాలాజీ నగర్, 60000
3. రాజేశ్వరి గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ 60000
4. సమద్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ బృందావన్ కాలనీ 60000
5. అమూల్య దమ్మైగూడ మున్సిపాలిటీ 60000
6. బి మల్లేష్ మూడు చింతలపల్లి మూడు చింతలపల్లి గ్రామం 60000
7.కీర్తిశేషులు రాఘవరెడ్డి మూడు చింతలపల్లి మండల్ కొల్తూరు గ్రామం 60000.ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు తీసుకున్నారు

# చెల్పూర్ గ్రామంలో విద్యుత్ అధికారుల పోల్ టు పోల్ తనిఖీలు



కబురు న్యూస్, హుజురాబాద్/:నవంబర్ 12,

హుజురాబాద్ రూలర్ సెక్షన్ లో చెల్పూర్ గ్రామం విద్యుత్ అధికారులు పోల్ టు పోల్ తనిఖీ నిర్వహించడం జరిగినది. ఈ తనిఖీలో భాగంగా హుజురాబాద్ రూలర్ ఏఈ జనార్ధన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి మీటర్ ద్వారానే విద్యుత్ వాడుకోవాలని వినియోగదారులకు సూచించడం జరిగినది. విద్యుత్ మీటర్ లేని కుటుంబాలకు 938 రూపాయలకే మీటర్ ఇవ్వడం జరుగుతుందని వినియోగదారులు దీన్ని తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోల్ టు పోల్ తనిఖీ లో పాల్గొన్న అధికారులు డిపిఏఈ రాములు ఏ ఈ లు సంపత్ రెడ్డి రఘు చారి ఫోర్ మెన్ సంజీవరావు ఎస్ ఎల్ ఐ రాజిరెడ్డి లైన్ ఇన్స్పెక్టర్ రామంచ సమ్మయ్య ,శ్రీనివాస్ లైన్మెన్లు ఐలేష్ కనకయ్య ఏ ఎల్ ఎం లు అంబాల వెంకటేశ్వర్లు శరత్ రెడ్డి తిరుపతి, గణేష్, చింతల్ మహేందర్ అధిక సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు తనిఖీ చేయడం జరిగినది.

# ప్రభాస్, పూరీ కాంబో రిపీట్..?



కబురు సినిమా నవంబర్ 12..

తెలుగు సినిమా ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది టాప్ డైరెక్టర్లలో ఒకడు పూరీ జగన్నాథ్. తన కెరీర్‌లో ఎంతో మంది యాక్టర్లకు బ్రేక్ అందించాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా డాషింగ్ డైరెక్టర్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తుంది. పూరీ గ్లోబల్ స్టార్ ప్రభాస్‌తో మరోసారి పనిచేయబోతున్నాడన్న క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తుంది. అయితే ఈ ఇద్దరు ఏం సినిమా చేస్తున్నారనే కదా మీ డౌటు. స్పిరిట్ ప్రాజెక్ట్. అదేంటి అనుకుంటున్నారా..? మీరు చదివింది నిజమే. ఈ సినిమాకు పూరీ డైలాగ్స్ రాస్తున్నాడట. కాప్ డ్రామా నేపథ్యంలో వచ్చిన పోకిరి, టెంపర్ డైలాగ్స్ బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేశాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మళ్లీ ఇదే జోనర్‌లో రాబోతున్న స్పిరిట్ సినిమా కోసం డైలాగ్స్ రాసే విషయమై డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇటీవలే పూరీని సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్ సైడ్ టాక్. ఇదే నిజమైతే కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న స్పిరిట్‌ను పూరీ డైలాగ్స్ మరో రేంజ్‌కు తీసుకెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే ప్రభాస్-పూరీ కాంబోలో వచ్చిన ఏక్ నిరంజన్, బుజ్జిగాడు సినిమాల్లోని డైలాగ్స్ ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోలో వచ్చే డైలాగ్స్ ఎలా ఉండబోతున్నాయన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

# సుకుమార్ కోసం ఆ సినిమా ఆపేశా : దిల్‌రాజ్

కబురు సినిమా నవంబర్ 12..



తెలుగు సినిమా ఇండస్ట్రీలో వన్ ఆఫ్ ది టాప్ డైరెక్టర్లలో ఒకడు పూరీ జగన్నాథ్. తన కెరీర్‌లో ఎంతో మంది యాక్టర్లకు బ్రేక్ అందించాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా డాషింగ్ డైరెక్టర్‌కు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తుంది. పూరీ గ్లోబల్ స్టార్ ప్రభాస్‌తో మరోసారి పనిచేయబోతున్నాడన్న క్రేజీ అప్‌డేట్ ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తుంది.అయితే ఈ ఇద్దరు ఏం సినిమా చేస్తున్నారనే కదా మీ డౌటు. స్పిరిట్ ప్రాజెక్ట్. అదేంటి అనుకుంటున్నారా..? మీరు చదివింది నిజమే. ఈ సినిమాకు పూరీ డైలాగ్స్ రాస్తున్నాడట. కాప్ డ్రామా నేపథ్యంలో వచ్చిన పోకిరి, టెంపర్ డైలాగ్స్ బాక్సాఫీస్‌ను ఏ స్థాయిలో షేక్ చేశాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. మళ్లీ ఇదే జోనర్‌లో రాబోతున్న స్పిరిట్ సినిమా కోసం డైలాగ్స్ రాసే విషయమై డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇటీవలే పూరీని సంప్రదించగా.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్ సైడ్ టాక్.ఇదే నిజమైతే కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న స్పిరిట్‌ను పూరీ డైలాగ్స్ మరో రేంజ్‌కు తీసుకెళ్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇప్పటికే ప్రభాస్-పూరీ కాంబోలో వచ్చిన ఏక్ నిరంజన్, బుజ్జిగాడు సినిమాల్లోని డైలాగ్స్ ఎంత పాపులర్ అయ్యాయో తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోలో వచ్చే డైలాగ్స్ ఎలా ఉండబోతున్నాయన్నది ప్రస్తుతానికి సస్పెన్స్ నెలకొంది.

# ప్రేక్షకుల ముందుకు భైరవంతో మంచు మనోజ్

కబురు సినిమా నవంబర్ 12..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ క్రేజీ మూవీ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కెకె రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుండి విడుదల చేసిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ లకు మంచి స్పందనను రావడమే కాకుండా హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ మంచు మనోజ్ మాస్ అవతార్‌ని ప్రజెంట్ చేస్తూ ఇంటెన్స్ ఫస్ట్



లుక్‌ను విడుదల చేశారు. 2024-11-12, 11.35.21. ఈ ఫస్ట్ లుక్‌ని గమనిస్తే.. వర్షంలో బ్లాక్ అండ్ బ్లాక్ దుస్తులలో గంభీరమైన ఫేస్ తో మనోజ్ యాక్షన్-ప్యాక్డ్‌గా కనిపించారు. ఈ సినిమాలో అతని పాత్ర ఎంత ఇంటెన్స్‌గా ఉండబోతుందో ఈ ఫస్ట్ లుక్‌తో అర్థమవుతోంది. ఈ యాక్షన్ పార్ట్ సినిమాలో మెయిన్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. నియో-నోయిర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న మూవీలో ప్రముఖ తారాగణం, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. ఇప్పటికే విడుదలైన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ లుక్, నారా రోహిత్ లుక్ లతో పాటు తాజాగా విడుదలైన మంచు మనోజ్ లుక్ సినిమాపై భారీగా అంచనాలను పెంచేవిగా ఉన్నాయి.

# అందుకే అమ్మ బయటకు రావటానికి ఇష్టపడదు : జూ.ఎన్టీఆర్

కబురు సినిమా నవంబర్ 12..

'స్టూడెంట్ నెం.1' చిత్రంతో హీరోగా అరంగ్రేటం చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు మనవడు జూనియర్ ఎన్టీఆర్ ఆది, సింహాద్రి సినిమాతో తిరుగులేని మాస్ హీరోగా ఎదిగాడు ఇక ఆ తరువాత జూనియర్ ఎన్టీఆర్ నట ప్రస్థానం గురించి అంతా తెలిసిందే. ఆర్ఆర్ఆర్ సినిమాతో పాన్ ఇండియా హీరోగా గుర్తింపు తెచ్చుకున్న ఈ నందమూరి హీరో ఇటీవల 'దేవర' చిత్రంతో



మరో ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ దేవర, వరగా ద్విపాత్రాభినయంలో తన నటనతో మెప్పించాడు. నటుడిగా, డ్యాన్సర్‌గా ఎన్టీఆర్‌కు మంచి పేరుంది. ఈ తరం హీరోల్లో ఎన్టీఆర్ వన్ ఆఫ్ బెస్ట్ ఫర్‌ఫార్మర్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. అయితే ఈ రోజు తాను నటనలో, డ్యాన్సుల్లో ఓ ప్రత్యేకత సంపాదించుకోవడానికి కారణం తన అమ్మే అంటున్నాడు ఎన్టీఆర్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ " నీ కంటూ ఏదైనా స్పెషాలిటీ ఉన్నప్పుడే, నీదంటూ ఓ మార్క్ క్రియేట్ చేసుకుంటేనే నలుగురిలో గుర్తింపు వస్తుందని చెబుతుండేది. ఆమె మాటల ఇన్‌స్పిరేషన్‌తోనే కూచిపూడి నేర్చుకున్నాను. అమ్మ నుంచే అందరితో మాట్లాడటం తెలుసుకున్నా. చాలా మంది అమ్మలు తమ పిల్లల్ని ఒంటరిగా బయటికి పంపించడానికి రకరకాల కారణాలతో ఒప్పుకోరు. మా అమ్మ మాత్రం ఎక్కడికైనా ఒంటరిగా వెళ్లమనేది. ఏ విషయమైనా సొంతంగా తెలుసుకోమనేది. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ఆమెప్పుడూ నా దగ్గర తన కష్టాల్ని దాచిపెట్టలేదు. కష్టాల నడుమనే ఎదగడం గొప్పదనం అని చెబుతుండేది. కష్టపడ్డ వారే ప్రతిఫలం అనుభవించాలి అంటుండేది. అందుకే నాకు హీరోగా ఎంతటి పేరొచ్చినా అమ్మ అసలు బయటికి రాదు. కష్టం నీదే కాబట్టి ప్రతిఫలం కూడా నీదే అనేది' అని అమ్మ గురించి విశేషాలను చెప్పుకొచ్చారు ఎన్టీఆర్.

# అద్దంలో చూసుకున్నప్పుడు నిజం తెలుస్తుంది : కమల్



కబురు సినిమా నవంబర్ 12..

తమిళ కథానాయకుడు కమల్ హాసన్ తాజాగా ఓ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తన పేరుకు ముందు అభిమానంతో అందరూ పిలుచుకుంటున్న ఉలగనాయన్‌తో కానీ ఇక ఎలాంటి స్టార్ ట్యాగ్స్‌తో పిలవొద్దని, కమల్ లేదా కమల్ హాసన్ అనే పేరుతో పిలవమని అందరికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. " నా నటనను మెచ్చి ఉలగనాయగన్' వంటి ఆత్మీయ ట్యాగ్‌లు అందించినందుకు ఎల్లప్పుడూ నేను కృతజ్ఞతుడిని. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను ప్రేక్షకులను అందించాలనే ఉద్దేశంతో నేను ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆ ప్రకటనలో తెలియజేశారు కమల్‌హాసన్. అయితే నటుడిగా అత్యధిక పురస్కారలు అందుకున్న వారిలో ఈయనే అగ్ర గణ్యుడు. నటుడిగా కమల్ అందుకున్నానని పురస్కారాలు ఎవరూ అందుకోలేదు. అయితే తనని తాను ఎప్పుడూ నటుడిగా నిత్యవిద్యార్థినే అనుకునే ఈ నటుడు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన నటన గురించి మరికొన్ని కామెంట్స్ చేశాడు. " అద్దంలో నా ముఖం చూసుకున్నప్పుడల్లా నటనలో పరిపూర్ణత వుండదనేది తెలిసిపోతుంది. నేను నటించిన కొన్ని సినిమాలు తరువాత చూసినప్పుడు మరింత బాగా నటిస్తే బాగుండేది అనిపిస్తుంది. నా మైనస్‌లు నాకు తెలిసిపోతాయి. అయితే అప్పటికి ఆ సినిమాకు అవార్డులు వచ్చి ఉంటాయి. అందరూ ప్రశంసించి ఉంటారు. అయినా ఆ పాత్ర కోసం నేను ఇంకా ఏం చేయగలనో నాకు తెలుసు. ఆ సినిమానే రీమేక్ చేసి ఆ లోపాలను సరిదిద్దుకోవాలనిపిస్తుంది. కానీ అది అంత సులువు కాదు. అందుకే నటనలో కంప్లీట్‌నెస్ అనేది వుండదు.కాకపోతే ఆ దిశగా సాధించే వరకు జర్నీ చేయాల్సిందే" అంటూ చెప్పుకొచ్చారు.


# జాన్వీకి రిస్క్ తీసుకోవడం అంటే ఇష్టం..

## నటిపై ప్రశంసలు కురిపించిన సోదరుడు



కబురు సినిమా నవంబర్ 12..

జాన్వీకపూర్‌పై ఆమె సోదరుడు అర్జున్ కపూర్ ప్రశంసలు కురిపించారు. కెరీర్‌లో రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడుతుందన్నారు. అవసరమైనప్పుడు ధైర్యాన్నిస్తుందన్నారు. 'సింగం అగైన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జాన్వీ, ఖుషి కపూర్‌లతో తనకున్న అనుబంధాన్ని అర్జున్ కపూర్ పంచుకున్నారు.'నాకు జాన్వీ, ఖుషి ఇద్దరిపైనా ఎంతో ప్రేమ ఉంది. వీరిలో జాన్వీతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఆమె ఏ విషయంలోనైనా నిజాయతీగా ఉంటుంది. ప్రశంసలను, విమర్శలను ఒకేలా తీసుకుంటుంది. ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కోసం ఎంతో కష్టపడుతుంది. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ.. కొత్త కథలను ఎంచుకుంటూ ప్రయోగాలు చేస్తుంటుంది. ఎక్కువ రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడుతుంది. ఆమె ప్రతి నిర్ణయానికి నేను మద్దతు ఇస్తాను. ఎప్పుడూ అండగా ఉంటాను. మేమిద్దరం రోజూ ఎన్నో విషయాల గురించి చర్చించుకుంటాం. తినే ఆహారం దగ్గర నుంచి.. తర్వాత చేయనున్న ప్రాజెక్ట్ వివరాల వరకూ ప్రతిదాని గురించి మాట్లాడుకుంటాం. ఇది ఎప్పటికీ ఇలాగే కొనసాగాలి' అని అర్జున్ కోరుకున్నారు ఇక జాన్వీకపూర్ ప్రస్తుతం బాలీవుడ్, టాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇటీవలే 'దేవర'తో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇందులో నటిస్తున్న సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ ప్రాజెక్ట్‌లోనూ అవకాశాన్ని అందుకున్నారు . బుచ్చిబాబు దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా ఇది రానుంది. మాస్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'పెద్ది' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి ఇందులో విలన్‌గా కనిపించనున్నట్లు సమాచారం.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kabturueveningdaily9106@gmail.com